నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

రేపటి చలో అసెంబ్లీకి రైతు జేఏసీ మద్దతు


మాట్లాడుతున్న రైతు నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు పూర్తి చేయాలని.. కేంద్ర ప్రభుత్వం పసుపును ఎంఎస్‌పి జాబితాలో చేర్చాలని జగిత్యాల రైతు ఐక్యవేదిక 24 మార్చి సోమవారం ఛలో అసెంబ్లీకి ఇచ్చిన పిలుపును ఆ డివిజన్ రైతు జేఏసీ మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం రైతు జేఏసీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రైతు జేఏసీ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, ప్రభాకర్, నక్కల భూమారెడ్డి, నవీన్‌రెడ్డి, డి.రమేష్‌రెడ్డి, బి.దేవరాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడానికి హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం 24 మార్చ్ ఛలో అసెంబ్లీకి జగిత్యాల రైతు ఐక్యవేదిక పిలుపును సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు తెలిపారు.


కోర్టులో ఒంటిపై కిరోసిన్ పోసుకున్న వ్యక్తి



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఓ వ్యక్తి కిరోసిన్ పోసుకున్న ఘటన కలకలం రేపింది. శనివారం ఉదయం కోర్టు ఆవరణలో నర్సింగ్ అనే వ్యక్తి కిరోసిన్ డబ్బాతో వచ్చాడు. అనంతరం తనపై కిరోసిన్ పోసుకున్నాడు. గమనించిన కోర్టు సిబ్బంది టనే అప్రమత్తమై నర్సింగ్ను అడ్డుకున్నారు. అనంతరం ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. కాగా బాధితుడి తండ్రి వ్యవసాయ శాఖలో ఉద్యోగం చేస్తుండగా మృతిచెందాడు. వారసత్వ ఉద్యోగం బాధతుడి తమ్ముడు చేపట్టాడు. ఆ సమయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఓ ఒప్పందం కుదిరినట్టు సమాచారం. అయతే తమ్ముడు ఒప్పందం ప్రకారం నడుచుకుంటలేడని మోసం చేశాడని వాపోతూ న్యాయం చేయాలని కోరుతూ కిరోసిన్ డబ్బాతో కోర్టుకు వచ్చినట్టు సమాచారం. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

నీటి గొడవ


బండరాళ్లు అడ్డుపెట్టి నీటి మళ్లింపు



- అధికారుల తీరుతో రెండూర్ల రైతుల మధ్య సాగునీటి కోసం ఘర్షణ
- కాలువలపై పర్యవేక్షణ లేకపోవడంతో నీరందని పరిస్థితి
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- మీకు తెలిసినట్టు చేసుకోమంటూ దబాయింపు


కాలువ తూము వద్దకు వచ్చిన రైతులు

నవతెలంగాణ-జుక్కల్

అసలే వేసవి కాలం. అందున నీటి వనరులు అంతంతే. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోరుబావులు ఎండిపోతుండటంతో ప్రాజెక్టుల నీటిపైనే రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన సమయమిది. ఇలాంట పరిస్థితిల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. కాలువలకు మరమ్మతులు చేపట్టగా, గేట్లు ఏర్పాటు చేయకపోవడంతో పిల్లకాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామాల మధ్య నీటి పంచాయితీ రగులుకుంటుంది. రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో చోటుచేసుకుంది. కౌలాస్‌ప్రాజెక్టు నీటి విషయంలో అధికారుల పట్టింపులేనితనంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..

జుక్కల్ మండలంలోని కౌలాస్, కేమ్రాజ్ కల్లాలి గ్రామాల రైతుల మధ్య కౌలాస్ ప్రాజెక్టు నుండి విడుదల చేస్తున్న డి6 మెయిన్ కెనాల్ నీటి విడుదల నుండి పిల్ల కాలువల నీరు తీసుకునేందుకు రెండు గ్రామాల రైతుల మధ్య వాగ్వివాదం శనివారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులు మాట్లాడుతూ వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉందని నీరు కావాలని కౌలాస్, కేమ్రాజ్ కల్లాలి గ్రామాల రైతులు తమకంటే తమకే ముందు కావాలని కోరారు. డి6 కెనాల్‌కు మొత్తం 9 తూములు ఉన్నాయి. అందులో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా 6 తూములు పనిచేయకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు నీటి సమస్యలు తీవ్రంగా నెలకొన్నాయి. డి6 కెనాల్ మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. దానికి ముఖ్యంగా డోర్లు బిగించకపోవడంతో సమస్య ఎదురవు తుంది. డోర్ ఉంటే దానికి రెండు రోజులు ఓ గ్రామానికి మరో రెండు రోజులు ఇంకో గ్రామానికి నీటని ఇవ్వడానికి అవకాశం ఉండేది. కానీ డోర్లు ఎవరో ఎత్తుకుపోవడంతో సమస్య రెండు గ్రామాల మధ్య నెలకొంది.

కాలువలో నీరు వెళ్లకుండా పిల్ల కాలువల వద్ద కౌలాస్ గ్రామానికి చెందిన రైతులు శనివారం ఉదయం రాళ్లను అడ్డంపెట్టి నీటిని పిల్లకాల్వోకి మళ్లించారు. ఈ విషయం తెలుసుకున్న కేమ్రాజ్ కల్లాలి గ్రామానికి చెందిన రైతులు వచ్చి ఆ రాళ్లను తొలగంచారు. దీంతో ఇరు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎన్నో సార్లు అధికారులకు విన్నవించాం

శాతం లాలు గ్రామం కేమ్రాజ్‌రాజ్ కల్లాలి



డీ6 కెనాల్ కింద నాకు మూడు ఎకరాల సాగు భూమి ఉంది. మొత్తం వరి పంటను వేశాను. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. నీరు పారిస్తేనే పంట పండుతుంది , లేకుంటే పంట దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది. అందువలన చివరి రెండు దశలు నీరు చాలా విలువైనది. ఈ గొడవ నీటి సమస్య అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం వల్లనే నిత్యం గొడవలు జరుగుతున్నాయ.

అధికారులు తెలిసింది చేసుకోమంటున్నరు

టి బస్వంత్ కౌలాస్ గ్రామ రైతు



డి6 కెనాల్ కింద మూడెకరాల భూమిలో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. చివరి రెండు దశలు నీరు కచ్చితంగా పెడితేనే వరి పంట దిగుబడి బాగుం టుంది. లేకుంటే పంట దిగుబడి తగ్గి పెట్టుబడి కూడా రాదు. అందువలన పోటీ తనం పెరగడంతో గొడవలు వస్తున్నాయి.. ఈ విషయం కౌలాస్ నాళా ప్రాజెక్ట్ అధికారులకు పలుమార్లు విన్నవిస్తే మీకు తెలిసింది చేసుకోండి అని మేమేం చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

9 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే
జీపీ కార్మికులు ఎలా బతకాలి..?

- బకాయి వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయించాలి
- గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)

జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షులు బాలనర్సు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

'ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 9 నెలలుగా వేతనాలు బకాయిలు ఉంటే.. గ్రామపంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని, వారి కుటుంబాన్ని ఎలా పోషించుకుం టారని' గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షులు బాలనర్సు ప్రశ్నించారు. బకాయిలు వేతనాలు చెల్లించాలని, అందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జీపీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లింపులు జరగలేదని, వాటి నిర్లక్ష్యం పైన చర్యలు తీసుకోవాలని, ఎస్‌టిఓలో నిలిచిపోయిన బకాయి చెక్కులకు నిధులు ఇవ్వాలని కోరారు. ముఖ్య మంత్రి ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ద్వారా జీపీ కార్మికులకు సైతం వేతనాలు చెల్లించాలని, వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

సిబ్బందికి నష్టదాయకంగా ఉన్న జీవో నెంబర్ 51 సవరించాలని మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్ ఇన్సూరెన్స్ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బాల నర్సు, నాయకులు బి సాయిలు, రూప్సింగ్, కే సాయిలు, కిషన్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

'అకాల' నష్టం


సదాశివనగర్‌లో నేలవాలిన మొక్కజొన్న చూపుతున్న రైతు

- ఈదురుగాలుల వర్షంతో పలువురు రైతులకు కోలుకోలేని దెబ్బ
- మొక్కజొన్నకు తీవ్ర నష్టం
- నష్టపోయిన పంటలు పరిశీలించిన అధికారులు


రాజంపేట్‌లో నేలవాలిన మొక్కజొన్న


గాంధారిలో


నవీపేట్‌లో వరిని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-విలేకరులబృందం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో కురిసిన అకాల వర్షంతో పలువురు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలు ధాటికి పొట్టదశలో ఉన్న వడ్లు నేలవాలగా.. మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా శనివారం పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలను అధికారులు పరిశీలించి పంట నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన తెలిపారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గాంధారి : గాంధారి మండలంలోని మాతు సంగెం రామలక్ష్మన్ పల్లి గ్రామాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం, శనివారం కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పంట నేల వాలింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన డీఏవో

భిక్కనూర్ : మండలంలోని అంతంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురు గాలుల వర్షానికి జరిగిన పంట నష్టాన్ని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ శనివారం పరిశీలించారు. సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి పంట నష్టాన్ని జిల్లా వ్యవసాయ అధికారికి వివరించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈదురుగాలుల వర్షానికి గ్రామంలో 15 ఎకరాల మొక్కజొన్న పంట నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక అందజేసి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ అపర్ణ, మండల వ్యవసాయ అధికారి శోభ, ఏ ఈ ఓ లు వినోద్, నికిత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మూడు ఎకరాల బొప్పాయి తోట నేలమట్టం

మండలంలోని లక్ష్మీదేవుని పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన గాలి వర్షానికి మూడు ఎకరాల బొప్పాయి తోట నేల మట్టం అయిందని గ్రామానికి చెందిన రైతు సుభాన్ రెడ్డి తెలిపారు. మూడు ఎకరాలలో 100 బొప్పాయి చెట్లు పెట్టడం జరిగిందని అకాల వర్షం కారణంగా పూర్తి చెట్లు నేల మట్టం అవడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

రాజంపేట్ : రాజంపేట్ మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షంతో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిగా నెలకొరిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పంటల పరిశీలన

నవీపేట్ : అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ రైతులతో కలిసి పరిశీలించారు. మండలంలోని కోస్లి, మట్టయ్య ఫారం, నాలేశ్వర్ తదితర గ్రామా లలో అకాల వర్షాలకు పంటలు నెలకొరగడంతో పరిశీలించారు. ఆయనవెంట ఏఈఓ వినోద్ ఉన్నారు.

వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి మొక్కజొన్న నేలకొరిగినది. వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రాత్రింబవళ్లు కష్టపడ్డ రైతులకు అకాల వర్షం వలన అపార నష్టం జరిగిందని వాపోతున్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏఈఓలు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అకాల వర్షాలకు నేల వాలిన మొక్కజొన్న పంటను పరిశీలించారు సదాశివనగర్ ఏ ఈ ఓ కవిత ధర్మారావు పేట ఏఈఓ శ్రీనివాస్ నాయక్ అడ్లూర్ ఎల్లారెడ్డి ఏఈఓ ఆకుల విజయ మొక్క జొన్నపంటలను పరిశీలించారు. పంట నష్ట వివరాలను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.


భిక్కనూర్‌లో : పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి


నేలవాలిన బొప్పాయిచెట్లు

బెట్టింగ్ చిన్నపాటి వినోదం కాదు
జీవితాలను నాశనం చేస్తాయ్

- యాప్‌లను ప్రమోట్ చేసే వారిపై పోలీస్ నిఘా
- ఐపీఎల్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య
- వడ్డేపల్లిలో ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య కలిచివేసినట్టు ఆవేదన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆన్‌లైన్ బెట్టింగ్ అన్నది చిన్న సరదా కాదని.. కుటుంబాలను, జీవితాలను నాశనం చేస్తాయని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య అన్నారు. ఒక కుటుంబాన్ని బెట్టింగ్ యాప్ కబలించిందని, ఇంకో జీవితాన్ని కోల్పోకూడదు అని, ప్రతి ప్రాణం కాపాడటమే తమ ధ్యేయం అని అన్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిపై, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. శనివారం కమిషనరేట్‌లో మాట్లాడారు.

వడ్డేపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి తల్లిదండ్రులు, 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ఉన్న బానిసత్వమే అని అన్నారు. 'ఈజీ మనీ వస్తుందనే ఆశతో బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టడం మొదలు పెట్టాడు. కానీ నష్టాలు పడుతూ, కుటుంబంపై అప్పుల భారం పెంచాడు. స్థలాన్ని అమ్ముకోవడం ద్వారా కూడా సమస్య పరిష్కారం కాలేదు. చివరికి ఆర్థిక ఒత్తిడితో మానసిక భాదతో ముగ్గురూ ఒకేసారి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రారంభంలో ఈ కేసును అన్నాచురల్ డెత్ డ్యూ టు ఫైనాన్షియల్ ట్రెస్ గా నమోదు చేశారు. కానీ నిజంగా ఇది ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. ఇది ఒక సామాజిక ప్రమాదం. ఫేక్ ప్రోమోషన్లతో మన యువతను మోసం చేస్తూ, పాడైపోయే దారి చూపించే బెట్టింగ్ యాప్‌ల దౌర్జన్యం. ఈ విషాద ఘటన పట్ల సీరియస్‌గా స్పందించిన నిజామాబాద్ పోలీస్ శాఖ కేసును తిరిగి పరిశీలించి, అసలు కారణాలపై దర్యాప్తు జరిపింది. దర్యాప్తులో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేసింది. ఈ కేసులో తెలిపిన సెక్షన్లను చేర్చారు' అని వివరించారు.

ఐపీఎల్‌లో బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీపీ

'ఇప్పుడు ఐపీఎల్ సీజన్ సమీపించుతోంది. ఈ టైంలో బెట్టింగ్ యాప్‌లు ఆకర్షణీయంగా, యువతను లక్ష్యంగా చేసుకుంటూ ప్రచారం చేయడం మొదలుపెడతాయి. అందుకే నిజామాబాద్ పోలీస్ శాఖ తరఫున ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జాగ్రత్తగా ఉండండి, అలర్ట్‌గా ఉండండి అని తెలియజేశారు. బెట్టింగ్ యాప్‌లు చిన్నపాటి వినోదం కాదని గుర్తించండి. ఇవి మన జీవితాలనే పాడుచేస్తున్నాయి. మన పిల్లల భవిష్యత్‌ను కాపాడుకోవాలి. ఇంకో కుటుంబం ఈ బాధను అనుభవించ కూడదు. నిజామాబాద్ పోలీస్ శాఖ ఈ బెట్టింగ్ మాఫియాను ఎదుర్కొనటానికి పూర్తిగా కట్టుబడి ఉంది. సోషల్ మీడియాలో ఎవరు ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు, ఎవరు లింక్స్ షేర్ చేస్తున్నారు అన్నదానిపై మేము సైబర్ మానిటరింగ్ చేస్తున్నాము. ఎవ్వరైనా అనుమా నాస్పదంగా ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్లు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మనల్ని మనమే రక్షించుకుందామని పిలుపునిచ్చారు.

లింగ నిర్ధారణ చేసే
స్కానింగ్ సెంటర్‌లను ఉపేక్షించొద్దు

- చట్టంలో నిబంధనలు అమలు జరిగేలా పర్యవేక్షించాలి
- జిల్లా జడ్జి వరప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షా చట్టంలో నిబంధనలు అమలు జరిగేలా పర్యవేక్షించాలని, ఈ చట్టంలోని నిబంధనలు పాటించని స్కానింగ్ కేంద్రాల పట్ల కఠిన వైఖరితో తగు చర్యలు చేపట్టాలని జిల్లా జడ్జి వరప్రసాద్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పిసిపిఎన్‌డిటి (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షా) చట్టం అమలు కోసం జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో జిలా జడ్జి వర ప్రసాద్ మాట్లాడుతూ.. స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులు, రిజిష్టర్‌ల నిర్వహణ పకడ్బందీగా ఉండేటట్టు చూడాలన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ.. స్కానింగ్ కేంద్రాలను తరచుగా వైద్య శాఖ అధికారులు తనిఖీలు చేస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై తీవ్రమైన చర్యలు చేపట్టాలని, నిబంధనలు పాటించని కేంద్రాల గుర్తింపు రద్దు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ నిబంధనలు పాటించని ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయకూడదు, ఏవైనా ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ లేకుండా ఉంటే వెంటనే వారికి నోటీసులు జారీ చేయాలని తెలిపారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జీ, కలెక్టర్

పరిమితికి మించి వైద్యం అందిస్తే చర్యలు తీసుకోవాలి

పీఎంపీ, ఆర్ఎంపి వైద్యుల పట్ల నిఘా పెంచి అర్హత లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల వైద్యులు రాసిన మందులనే మెడికల్ షాప్‌లలో ఇవ్వాలని, మందుల చీటీ లేకుండా మందులు ఇస్తున్న మెడికల్ షాప్‌లపైన తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులపైన, స్కానింగ్ కేంద్రాలపైన చట్ట రీత్యా చర్యల కోసం అవసరమైతే కేసులు పెట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు డా.శిరీష, డా.విద్య, డా.ప్రభు కిరణ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డా.అరవింద్, ఇంచార్జి డెమో వేణుగోపాల్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి చలపతి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు మంచి పేరు తేవాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన దుద్దు కీర్తన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడల్లో బాగా ఆడాలని, ఇండియాకు, జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కీర్తనను శాలువాతో ఘనంగా సన్మానించారు.


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

జానకంపేట్‌లో గుడిసె దహనం

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శనివారం ఉదయం నివాసపు గుడిసెను దహనం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దండ్ల నరసవ్వకు చెందిన నివాసపు గుడిసె కాలిపోయింది. తాను ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తన ఇల్లుకు నిప్పు పెట్టారని, ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, బియ్యం, రూ.30 వేల నగదు, రెండు తులాల బంగారం కాలిపోయాయని బాధితురాలు బోరున విలపించింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

ఎల్‌ఆర్‌ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు సువర్ణ అవకాశం
- ఈ నెల 31లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తింపు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందని గుర్తుచేశారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటదివెంట అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేకమంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఈ నెల 31వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అన్న ప్రసాదం కోసం స్టీల్ ప్లేట్స్, గ్లాసుల వితరణ


ప్లేట్స్, గ్లాసులు అందజేస్తున్న గంగాధర్ విజయ దంపతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని పాటి హనుమాన్ దేవాలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాదం వితరణ కోసం మండల కేంద్రానికి చెందిన కొమ్ముల వేప చెట్టు గంగాధర్-విజయ దంపతులు స్టీల్ ప్లేట్స్, గ్లాసులను వితరణ చేశారు. శనివారం పాటి హనుమాన్ దేవాలయం వద్ద 100 స్టీల్ ప్లేట్లు, 50 స్టీల్ గ్లాసులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు కొమ్ముల వేప చెట్టు గంగాధర్-విజయ దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆంజనేయ స్వామి వారి తీర్థ ప్రసాదాలను గంగాధర్-విజయ దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాత్రిక రాజు, వేంపల్లి దశ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో సైన్స్ ఫెయిర్

నవతెలంగాణ-ఆర్మూర్


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కొత్త కొత్త ఇన్నోవేటివ్ ఐడియాస్‌ను ప్రయోగాల రూపంలో చూపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిన్హాజ్ మాట్లాడుతూ.. మనిషిని చీకటి నుంచి వెలుగులోకి తెచ్చేది సైన్సు మాత్రమే నన్నారు. టెక్నాలజీపై విద్యార్థులకు పట్టు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ శేఖర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు విజయ్ కర్తాన్, నాగేశ్వరరావు, మెహిన్ జబ్రి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో ఎస్ఐ రజినీకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీని శనివారం నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలు వాహనదారులకు చలాన్లు విధించారు. వాహనదారులకు తగు సూచనలను సైతం అందజేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా పెట్రోలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. రాత్రి పూట ఆయా గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల 'అపూర్వ కలయిక సమ్మేళనం' కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ముప్కాల్ జీఎస్ఆర్ గార్డెన్‌లో చేపడుతున్నట్లు పూర్వ విద్యార్థులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

టీబీ ముక్త్ పంచాయతీ అభియాన్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఎల్పీఓ నాగరాజ్

నవతెలంగాణ-బోధన్

టీబీ ముక్త్ పంచాయతీ అభియాన్ కార్యక్రమంపై శనివారం బోధన్ పట్టణంలోని ఆజంగంజ్ రైతు వేదికలో డీఎల్పీఓ నాగరాజ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. టీబీ రహిత జిల్లాగా మార్చడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ రాజు, ఉప వైద్యాధికారి విశాలరాణి, బోధన్, సాలూర ఎంపీడీఓలు బాలగంగాధర్, శ్రీనివాస్, చందూర్ ఎంపీడీఓ నీలావతి, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టీబీ కోఆర్డినేటర్ నరేష్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 14న విశారదన్ మహారాజ్ మా భూమి రథయాత్ర

- కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి నాయకులు

ఏప్రిల్ 14న డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర కరపత్రాలను నిజామాబాద్ నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో డి.ఎస్.పి జిల్లా అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో డీఎస్పీ రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ నేతృత్వంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.ఎస్.పి రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. బీసీ, ఎస్సి, ఎస్టీ రాజ్యాధికార జేఏసీ అండ్ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీసీ, ఎస్సి, ఎస్టీ రాజ్యస్థాపనకై, ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వంపై ప్రజాస్వామ్య యుద్ధానికై డా.విశారదన్ మహారాజ్ 1 లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి రోజున ఆదిలాబాద్‌లో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ యాత్ర ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు 3 సంవత్సరాల 3 నెలలు కొనసాగుతుందని వివరించారు. రాజ్యం, సంపద, అధికారం, భూమి అట్టడుగు అణగారిన వర్గాల ప్రజలకు సాధించే ంతవరకూ డా.విశారదన్ మహారాజ్ నేతృత్వంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మురళి, ప్రశాంత్, మండలాధ్యక్షులు మహేష్, పోచయ్య, మైపాల్, కిషన్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్ పట్ల అసభ్య ప్రవర్తన

- యువకుడిపై పోక్సో కేసు నమోదు
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్టు భీంగల్ ఎస్ఐ జి మహేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన తీగల అక్షయ్.. ఓ బాలికకు ఫోన్లు చేస్తూ మాయమాటలు మాట్లా డుతూ.. ఈ నెల 22న ఉదయం 9 గంటల సమయంలో మైనర్ బాలికను ఇంట్లోకి బలవంతంగా తీసుకెళ్లి ఆమె అసభ్యంగా ప్రవర్తిం చాడు. దీంతో బాలిక అరుస్తూ, కేకలు వేయగా చుట్టుపక్కల వారు విని అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. కాగా బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. బాలిక మైనర్ కావడంతో ఆర్మూర్ ఏసీపీ కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించాలి

- ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా డిపిఎం మారుతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


అవగాహన కల్పిస్తున్న జిల్లా డిపిఎం మారుతి

మానవ అక్రమ రవాణా నివారించే అంశంపై మహిళా సంఘం సభ్యులందరికీ అవగాహన కల్పించాలని ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా డిపిఎం మారుతి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు, చిన్నపిల్లలు అక్రమ రవాణా చేసి బొంబాయి కలకత్తా వంటి పట్టణాలలో పాటు ఇతర దేశాలకు విక్రయిస్తున్నారని, తద్వారా వారు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. అతి నిరుపేదలు, బలహీన వర్గాలకు చెందిన వారిని గుర్తించి వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. ఈ అంశాలపై ప్రతి ఒక్క మహిళా సంఘ సభ్యురాలికి అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలు ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా మహిళల ఫోటోలను, వీడియోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తద్వారా వారిని అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ఐకెపి సీసీలు గ్రామ సమాఖ్యల పాలకవర్గ సభ్యులు ప్రతి ఒక్క సభ్యురాలికి ఈ అంశంపై అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు అన్ని గ్రామ సంఘాల్లో, అన్ని చిన్న సంఘాల్లో తీర్మానాలు చేయాలని సూచించారు.

ప్రతి ఒక్క మహిళను అప్రమత్తం చేయాలి : ఏపీఎం కుంట గంగాధర్

మండలంలోని ప్రతి ఒక్క మహిళకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్థానిక ఐకెపి ఏపిఎం గంగాధర్ పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వయం సహాయక సంఘంలో కూడా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండే అంశంలో పూర్తి అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్ణయిం చుకున్నామన్నారు. భౌతిక కిడ్నాప్ రూపంలోనే కాకుండా సైబర్ రూపంలో కూడా మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల ద్వారా మహిళలతో మాటలు కలిపి వారిని వక్రమార్గంలోకి పయనించేలా చేస్తున్నారని ఈ అంశాల పట్ల అవగాహన కలిపించి మహిళలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ఐకెపి ద్వారా చేపట్టిందని తెలిపారు. ఎలాంటి సైబర్ నేరాలు జరిగిన, బెదిరింపులకు పాల్పడిన వారిపై 1930 సైబర్ క్రైమ్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవికుమార్, పిరియా, భాగ్యలక్ష్మి, సిబ్బంది ధనలక్ష్మి, అనసూయ, గ్రామ సమాఖ్యల అధ్యక్షురాల్లు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ సొసైటీ ఎన్నికల అధికారుల నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా అడ్వకేట్స్ మ్యుచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 2025-26వ వార్షిక ఎన్నికల నిర్వహణ కోసం ప్రధాన ఎన్నికల అధికారిగా ఎర్రం విఘ్నేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా బిట్ల రవిని నియమిస్తూ సొసైటీ అధ్యక్షుడు మాదస్తు రాజారెడ్డి, కార్యదర్శి కొండకొల్ల శ్రీనివాస్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని సొసైటీ కార్యాలయంలో రాజారెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాబోయే ఆర్థిక సంవత్సరానికిగాను నాలుగు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల విధివిధానాలు ఎన్నికల అధికారులు ప్రకటిస్తారని అన్నారు. సొసైటీ డైరెక్టర్లు నిర్మల్కర్ సంతోష్, నారాయణ దాసు, గోవర్ధన్, శంకర్, న్యాయవాదులు నరేందర్ రెడ్డి, మాణిక్ రాజు, ఆశ నారాయణ పాల్గొన్నారు.

రఘునాథ ఆలయాభివృద్ధికి రూ.20 కోట్ల నిధులివ్వండి : అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ పట్టణంలో సుమారు వెయ్యి ఏళ్ళ చరిత్ర ఉన్న శ్రీ రఘునాథ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని.. ఈ ఆలయాభివృద్ధికి రూ.20 కోట్ల నిధులివ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రముఖమైన వేములవాడ రాజన్న దేవాలయం, యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఇంకా తెలంగాణలో ఉన్నటువంటి అనేక దేవాలయాల్లాగే చారిత్రక వైభావానికి చిహ్నంగా, ఆధ్యాత్మిక చింతనకు అలవాలంగా ఉన్న ఈ ఖిల్లా రామాలయంలో రాముల వారినీ దర్శించుకోవడానికి ఉత్తర తెలంగాణలోని భక్తులతోపాటు పక్కన ఉన్న మహారాష్ట్ర ప్రాంతం నుంచి భక్తులు వేల సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

కేసెట్ ఎల్-2 రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో హైదరాబాద్ ఈ అభ్యాస్ కే సెట్ఎల్-2 ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ శనివారం తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సాగర్ సార సర్టిఫికెట్స్, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఒలంపియాడ్ ఐఐటి ఇంచార్జ్ ఉపాధ్యాయులు సతీష్, సందీప్, నిఖిల, శ్వేతా, రాజశ్రీ, శారద, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వర్ణకార సంఘం, కిరాణా మర్చంట్ సభ్యులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో స్వర్ణకార సంఘం, కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారి సహకారంతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ప్రారంభించారు. ఈ చలివేంద్రం ఏర్పాటు కోసం సహకరించిన వారిని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఏఈ శ్రీకుమార్, ఆర్ఐ రాజేశ్వర్, స్వర్ణకార సంఘం సభ్యులు, కిరాణ మర్చంట్ సంఘం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలి

- వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులకు కోరిన రైతు కమిషన్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ కోరారు. ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా యాసంగిలో సాగుచేస్తున్న పంటల వివరాలు, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల వివరాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లను వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అందులో భాగంగానే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కూడా అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటుందని గడుగు గంగాధర్ స్పష్టం చేశారు.

25న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం బహిరంగ సభ

- రైతులు పాల్గొని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలను ఈ నెల 25,26,27 తేదీలలో నిర్వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. మార్చి 25 మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ప్రెస్ క్లబ్ నుండి పులాంగ్‌లోని గోనెరెడ్డి ఫంక్షన్‌హాల్ వరకు ప్రదర్శన గోనెరెడ్డిలో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. ఈ బహిరంగ సభకు జిల్లాలోని రైతాంగం, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రాజన్, నెల్లికంటి సత్యం, సిపిఐ ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భాగం హేమంతరావు, పశ్య పద్మ పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతాంగం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మార్చ్ 26,27 తేదీల్లో బిఎల్ఎన్ గార్డెన్లో మహాసభలు కొనసాగుతాయని అన్నారు. సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రతినిధులు పి.సుధాకర్, అడ్డికే రాజేశ్వర్, వై.రాజిరెడ్డి, కోయేడి నరసింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్ హైస్కూల్‌లో రేపటి నుంచి రోబోక్వీజ్

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సెయింట్ పాల్ హై స్కూల్‌లో సోమవారం 24వ తేదీ నుంచి నేటి ఆధునిక టెక్నాలజీపై రోబో క్విజ్ నిర్వహించనున్నట్టు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సేసిలియా పాల్ శనివారం తెలిపారు. ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు గల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించే ఈ కార్యక్రమంలో చివరి రోజు 27వ తేదీ గురువారం ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌ను పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న రేవంత్ సర్కారు కనీసం నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కులను కూడా అణిచివేయడం సిగ్గుచేటన్నారు. ముందస్తు పేరుతో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ఖండించాలని ప్రజాస్వామ్యక వాదులను కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

విజ్ఞాన విహారయాత్రలో ఐలాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహారయాత్ర కు బయలుదేరారు. ప్రాథమిక పాఠశాల అయిలాపూర్ విద్యార్థులు విద్యా విజ్ఞాన విహార యాత్రలో భాగంగా నెమిలి, తెలంగాణ తిరుమల, అలీసాగర్, బాసర, సారంగాపూర్, డిచ్ పల్లి రామాలయం వంటి స్థలాలను సందర్శించినట్టు ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ప్రాంతాలను సందర్శించి, వాటి విశిష్టతలను తెలుసుకున్నారు.ఇలాంటి యాత్రలు వల్ల విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, శివనంద, లావణ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి విరాళం అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమానికి రూ.51వేలు విరాళం కమిటీ సభ్యులకు అందజేసినట్టు శనివారం తెలిపారు. అదిలాబాద్ జిల్లాలోని పటాన్‌బోరి గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి దంపతులు ఆలయంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు గాను నగదుతో పాటు ఒక క్వింటాల్ పప్పు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఏనుగు రాఘవరెడ్డి, బాలకృష్ణ రావు, గట్టయ్య, ఆంజనేయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద మున్సిపాలిటీలో
గోపన్‌పల్లి గ్రామాన్ని కలపొద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోతున్న బిచ్కుంద మునిసిపాలిటీలో గోపన్‌పల్లి గ్రామపంచాయతీని విలీనం చేయవద్దు అంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపన్ పల్లి గ్రామంలో కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గ్రామస్తులుతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించారు. గోపన్‌పల్లి గ్రామాన్ని బిచ్కుంద మునిసిపాలిటీలో కలపడం వల్ల తమ గ్రామం అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోతామని అలాగే అన్ని రకాల టాక్స్‌లు పెరుగుతాయని ఉపాధి హామీ కోల్పోయి కూలీలు తీవ్రంగా నష్టపోతామని అలాగే తమ గ్రామం రాజకీయ ఉనికిని పంచాయతీ కార్యవర్గాన్ని సర్పంచ్ లాంటి పదవులను పూర్తిగా కోల్పోతామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామం పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామం కావున మునిసిపల్ చట్టాలకి లోబడి జీవించడం ఇబ్బందితో కూడుకుంటుందని గ్రామ ప్రజల జీవన విధానం దెబ్బతింటుందని తమ మనుగడ కష్టమవుతుందని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ముందు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న అధికారులు

గోపనపల్లి గ్రామ పొలిమేరలో ఉన్న ఎల్లయ్య అండ్ సన్స్ స్టోన్ క్రషర్ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా నడుపుతున్నారని దీని వల్ల వెలువడే పోగ దుమ్ము ధూళి శబ్ద కాలుష్యం తమ గ్రామ ప్రజలకు విపరీతంగా ఇబ్బంది కలిగిస్తున్నాయని ఈ స్టోన్ క్రషర్ లో డాంబర్ మిక్స్ ప్లాంట్ వలన విపరీతమైన దుర్గంధం ను వెదజల్లుతున్నదని దానివల్ల తమ గ్రామస్తులు తీవ్ర స్వస్థతకు గురవుతు క్యాన్సర్ బారిన పడుతున్నారని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్టోన్ క్రషర్ ను ఇక్కడి నుండి తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ ఎల్లయ్య అండ్ సన్స్ స్టోన్ క్రషర్ లోకి వెళ్లి పరిశీలించారు. ప్రజా అభిప్రాయ సేకరణ పూర్తి నివేదికలు తయారుచేసి జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద తహసీల్దార్ వేణుగోపాల్ సీఐ జగదం నరేష్, ఎండిఓ గోపాలకృష్ణ, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.5.10 లక్షలు పలికిన వార సంత

- రోజువారి సంత వేలం వాయిదా

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తైబజార్ వేలంపాటలో వారాంతపు సంత వేలం పాట పట్టణానికి చెందిన వేణు 5 లక్షల 10 వేల రూపాయలకు దక్కించుకున్నారు. కాగా రోజు వారి సంత వేలంపాట ప్రభుత్వం నిర్ణయించిన ధర రానందున 24వ తేదీ సోమవారం మరోసారి నిర్వహించనున్నట్టు జీపీ సెక్రటరీ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి కలవారు 24న ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని పలు గ్రామాల్లో లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్టు ఉపాధ్యక్షులు గైని శివాజీ శనివారం తెలిపారు. తాడ్వాయి, బ్రాహ్మణపల్లి, దేవయిపల్లి, కృష్ణాజివాడి, బ్రహ్మాజీ వాడి, గ్రామాలకు చెందిన 11 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, షౌకత్, నారోజీ, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైని శివాజీ, నరసారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు, అభివృద్ధి పనుల పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో ఎంపీడీవో, ఇతర అధికారులతో కలిసి గ్రామాలలో నెలకొన్న మౌలిక సదుపాయాలు , సమస్యలు , అభివృద్ధి పనుల పై శనివారం పర్యటించి పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్ , ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ ఏఈ సయ్యద్ నయూమ్ మాట్లాడుతూ మండలంలోని బంగారు పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించుకుంటున్న డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం కోసం మార్కౌంట్ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం దోసుపల్లి, గుండూర్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించారు.

గత వారం రోజులుగా పెద్దగుల్లాలో తీవ్ర నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామస్తులకు మొదట ఎంపిడిఓ గ్రామ ప్రజలను కలిసి మాట్లాడారు. ఒక వ్యవసాయ రైతు పొలంలో ఉన్న బోరు నుండి అద్దెకు నీరు తీసుకోవడానికి ఒప్పందం చేసుకొని గ్రామంలో నీరు వచ్చే విధంగా పైప్ లైన్ ద్వారా గ్రామస్తులు సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని గ్రామ హనుమాన్ ఆలయానికి సహకరించిన దాతకు సన్మానం చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు ఆర్.రాజాగౌడ్ హనుమాన్ ఆలయానికి రూ.20 వేలు విలువ గల మైక్‌సెట్‌ను విరాళంగా అందించారని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబిర్ శ్యామ్‌రావు, కాముని సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలో శనివారం 10వ తరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. మండల విద్యాధికారి యోసఫ్ తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు .690 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అన్నారు ప్రతి ఒక్కరు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, రథోత్సవ శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద రథం మద్నూర్ మండల కేంద్రంలో ఉంది. ఈ రథోత్సవాలు ప్రతి సంవత్సరం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తారు. రథోత్సవ ఊరేగింపు రహదారి ఇబ్బందికరంగా ఉండటంతో రోడ్డు వెడల్పు పనుల కోసం జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు రూ.20లక్షలు నిధులు మంజూరు చేస్తూ సిసి రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. వెడల్పు రోడ్డు నిర్మాణం పనులతో రథోత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నాటకీయ పరిణామంగా సాగి..
చివరకు వాయిదా

నవతెలంగాణ-పిట్లం

పిట్లం మండల కేంద్ర గ్రామ పంచాయతీ గొర్రెల మేకల వేలం పాటను శనివారం రెండవసారి పంచాయతీ ప్రత్యేక అధికారి కమలాకర్ (ఎంపీడీవో) అధ్యక్షతన నిర్వహించగా.. వేలం పాట నాటకీయ పరిణామంగా కొనసాగగా చివరకు ప్రభుత్వం నిర్ణయం మేరకు ధర పలకనందున బాన్సువాడ డివిజనల్ పంచాయతీ ఇన్చార్జి అధికారి సత్యనారాయణరెడ్డి సూచనతో వేలం మరోసారి వాయిదా పడింది.

9 మంది ఔత్సాహికులు పాల్గొని రెండు లక్షల రూపాయలను గ్రామపంచాయతీ నిబంధనాల మేరకు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొన్నారు. గత వేలంలో నాటకారి రాజేష్ 6 లక్షల ఒక వెయ్యి పాటపై వాయిదా వేశారు. తిరిగి నేడు ప్రారంభించగా.. నాటకీయ పరిణామంగా వేలం పాట పాడినప్పటికీ చివరి పాట నాటకారి రాజేష్ 6 లక్షల 8 రూపాయల పాటపై రెండవసారి వాయిదా వేశారు. సోమవారం నాటికి వాయిదా వేశారు . వాయిదాను సడలించాలని ఔత్సాహికుల కోరిక మేరకు వేలం పాటను మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించారు. వేలంపాట నిర్వహించగా నాటకీయ పరిణామంగా ఇద్దరు ముగ్గురు ఒక వెయ్యి చొప్పున పెంచి వేలం పాట పాడగా చివరకు ఆరు లక్షల 12 వేల రూపాయలు పాట పాడిన నాటకారి రాజేష్ పాటపై ఏ ఒక్కరు స్పందించకపోవడంతో ఇట్టి వేలం పాట సర్వ అధికారాలను ఇన్చార్జి డి ఎల్ పి ఓ అభిప్రాయం మేరకు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బలరాం , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలుగు నాడు విద్యార్థి సమైక్య (టీఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం ఉచిత నమూనా ఎంసెట్ నీట్ పరీక్షను ఆదివారం ఉదయం 10 గంటల నుండి ఒకటి గంటల వరకు వీఆర్కే అకాడమీలో నిర్వహించనున్నట్టు టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలిపారు. శనివారం కరపత్రాలను ప్రముఖ గణిత శాస్త్ర అధ్యాపకులు జలిగామ శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల సాధన కోసం పోరాటాలు చేయడమే కాకుండా, విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల అవగాహనను, భయాన్ని తొలగించడం కోసం నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 100 మినిట్స్ 100 షార్ట్ కట్స్ అనే కార్యక్రమాన్ని గణిత అధ్యాపకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవళి, సంధ్య, ప్రసన్న, రజిని, వసంత, సంతోష, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

24న ఆశాల చలో హైదరాబాద్

- విజయవంతం చేయండి : సీఐటీయూ నాయకులు రవీందర్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రవీందర్

నవతెలంగాణ-బాన్సువాడ(కామారెడ్డి)

ఆశా కార్యకర్తల సమస్యల పైన ఈనెల 24 న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్ర మాన్ని ప్రతి ఆశా కార్యక ర్తలు పాల్గొని విజయ వంతం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జే రవీందర్ కోరారు. బాన్సువాడ పట్టణంలో సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పైన అసెంబ్లీలో చర్చించి 18000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతుందన్నారు. ఆశా కార్మికుల పైన మాట్లాడకపోవడం చాలా సిగ్గుచేటు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌తో ఈనెల 24వ తేదీ నా చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో కోటిలో కమిషనర్ కార్యాలయం ముట్టడి ఉంటుందని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు అందరూ ప్రతి ఒక్కరు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ ఆశ లీడర్స్ లావణ్య, గంగమణి, అనురాధ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.17.50 లక్షలు పలికిన తైబజార్ వేలం

- గత ఏడాది కంటే రూ.4,39,500 అధికం

నవతెలంగాణ-మద్నూర్

తైబజార్ వేలంపాట రూ.17. 50 లక్షలు పలికింది. మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ప్రత్యేక అధికారి మండల ఎంపీడీవో రాణి అధ్యక్షతన వేలంపాట శనివారం నిర్వహించారు. ఈ ఏడాది తై బజార్ వేలం రూ.17,50,500 పాత తైబజార్ కాంట్రాక్టర్ అవార్ వార్ హనుమాన్లు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 4,39,500 అధికంగా పలికింది. తైబజార్ గుత్తేదారు అవార్వార్ హనుమాన్లకు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినంధించారు. గ్రామస్తుల సూచనల మేరకు గత ఏడాది తైబజార్ వసూళ్లపై గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గ్రామపంచాయతీ కార్యదర్శి కొన్ని నిబంధనలు విధించారు.

రోజువారి వసూళ్లలో కొన్ని సడలింపులు చేశారు. 5ఇ5 స్థలంలో వ్యాపారాలు కొనసాగించే వారికి నెలవారి తైబజార్ చెల్లింపులను రూ.1500 చేశారు. ఈ వేలంపాట కంటే ముందుగా గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్ తైబజార్ నిబంధనల గురించి వివరించారు. పంచాయతీ నిబంధనల ప్రకారమే వసూలు జరగాలని ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడకూడదని తెలియజేశారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

తైబజార్ ద్వారా వచ్చే ఆదాయం నుంచి వారం, వారం జరిగే సంత వ్యాపారులకు, పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు గాని మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామస్తులు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి రాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్‌లను ప్రత్యేకంగా విన్నవించారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఈ నిధుల ద్వారా సంత వ్యాపారులకు, ప్రయాణికులకు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రజా సేవకుడిగా.. ప్రజల కోసం పని చేస్తా

- మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి



'సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, వ్యవసాయం చేస్తూ గ్రామాల్లోని కూలీల, పేద ప్రజల కష్టనష్టాలను దగ్గ రుండి చూశా. వారికి నా వంతుగా సేవ చేయాలని భావించి రాజకీయాల్లోకి వచ్చా. ప్రజల కోసం ప్రజా సేవకుడిగా పని చేస్తున్నా. సేవ కార్యక్రమాల్లో భాగంగానే నారెడ్డి స్వ చ్ఛంద సంస్థను స్థాపించినట్టు' రామారెడ్డి మాజీ జడ్పీటీసీ, స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ నారెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. రాజకీయ అరంగ్రేటం, స్వచ్ఛం సంస్థ ఏర్పాటు, కాంగ్రెస్‌లో తన పని తీరుపై నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఏ ఉద్దేశ్యంతో స్థాపించారు.?

మోహన్ రెడ్డి: చదువు పూర్తయిన తర్వాత స్వగ్రామం పోసానిపేటలో వ్యవసాయం చేస్తున్న రోజుల్లో పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు కష్టాలను, ఇబ్బందులను దగ్గరుండి చూసి వారికి ఎంతో కొంత అండగా ఉండాలని నా రెడ్డి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశా. మండలంలో ఎవరికి ఆపద వచ్చినా కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ఎంతో కొంత సహకారం అందిస్తూ అండగా ఉంటున్నాను.

నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు?

మోహన్ రెడ్డి: మండలంలో, ప్రమాదవశాత్తు నివాసపు ఇండ్లు దగ్ధం అయిన, చదువుకునేందుకు, వివాహాలకు, కుటుంబ సభ్యులను కోల్పోయి, వికలాంగులకు, వృద్ధులకు, అనారోగ్య బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, కరోనా సమయంలో ఆశా వర్కర్లకు, పంచాయతీ సిబ్బందికి, పేద ప్రజలకు నిత్యవసర సరుకులను, వలస కార్మికులకు భోజనాలను నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించాము. ఇలాంటి కార్యక్రమాలతో సంస్థ ద్వారా ఆపన్న హస్తాన్ని అందిస్తున్నాము.



పుస్తేమట్టెలు అందజేస్తున్న ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి(ఫైల్)

ఏ లక్ష్యంతో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు?

మోహన్‌రెడ్డి : ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఏవైనా, ప్రజల ఇబ్బందులను చూసి, స్వచ్ఛంద సంస్థతో పాటు, ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లక్ష్యంతో, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి అడుగు పెట్టాను.

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా.. కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా ఎలా గెలుపొందారు?

మోహన్‌రెడ్డి: నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ సేవలను గుర్తించిన మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, ప్రజల పక్షాన, ప్రజా గళం వినిపించే, నాయకుడిగా గుర్తించి గెలిపించారు. నాతో పాటు గెలిచిన పలువురు జడ్పీటీసీలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి మారారు. కానీ కాంగ్రెస్ పార్టీ నన్ను నమ్మి టికెట్ ఇచ్చింది. ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నమ్మి గెలిపించినందుకు, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ మారకుండా ప్రజల కోసం పని చేశాను.

ఆ సమయంలో అధికార పార్టీ ఒత్తిళ్ళను ఎలా అధిగమించారు?

మోహన్ రెడ్డి: నేను జడ్పీటీసీగా ఉన్న సమయంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. నన్ను పార్టీ మారడానికి అనేక రకంగా ఒత్తిళ్లను తెచ్చింది. ప్రజల కోసం చేస్తున్న పోరాటంలో ఎన్ని కేసులు పెట్టిన, బెదిరింపులకు భయపడకుండా, తాయిలాలకు తలొగ్గకుండా ప్రజల కోసం పనిచేస్తూ, జిల్లా పరిషత్‌లో గళం వినిపించాను. ప్రజల కోసం పనిచేయటంలో సంతృప్తి ఉంది.

ఎలాంటి సమస్యలపై గళం విప్పారు..?

మోహన్‌రెడ్డి : మండలంలోని గంగమ్మ వాగు, రెడ్డి బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల కోసం, రామారెడ్డి చెరువు అలుగు తెగిపోతే నిర్మాణంపై, రైతుల వరి ధాన్యం కొనుగోలు జాప్యంపై కళ్ళల్లో నిద్రించాం. ప్రజల కోసం ఇలాంటి చాలా కార్యక్రమాలు చేశాం.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉంది. మీ లక్ష్యం ఏంటి, భవిష్యత్తు ప్రణాళిక ఏంటి?

మోహన్‌రెడ్డి : గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రామారెడ్డి మండలానికి నిధుల కేటాయింపు విషయంలో బీఆర్ఎస్ వివక్ష చూపింది. దీంతో ప్రజా సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వంతో పోరాడాము. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను లబ్దిదారులకు చేర్చే విధంగా పని చేస్తున్నాం. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నా. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీకి సేవ చేస్తాను. అధిష్టానం ఎలాంటి బాధ్యతలు అప్పగించినా పార్టీ విధేయుడిగా నిర్వహిస్తాను.

అయ్యప్ప ఆలయానికి రూ.10,116 విరాళం

నవతెలంగాణ-ఏర్గట్ల
మండల కేంద్రానికి చెందిన జుంగల పెద్ద గంగారం కుమారుడు జుంగల గంగ శ్రీను పుట్టినరోజు సందర్భంగా ఏర్గట్ల అయ్యప్ప స్వామి ఆలయానికి వారి కుటుంబ సభ్యులు రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి వారు గంగ శ్రీను కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు.


విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

బోధన్ మున్సిపాలిటీలో తైబజార్ వేలం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ తైబజార్ వేలం నిర్వహించారు. తైబజార్‌కు సంబంధించిన బహిరంగ వేలంలో 32 మంది పాల్గొన్నారు. వారిలో మహమ్మద్ కబీర్ అహ్మద్ రూబీ రూ.23,45,000లకు తైబజార్ వేలాన్ని దక్కించుకున్నారు. జంతు వధశాల వేలంలో 14 మంది పాల్గొనగా వారిలో అత్యధిక వేలంపాట పాడిన అబ్దుల్ అజీజ్ రూబీ రూ.4,52,000 జంతు వధశాల వేలం దక్కించుకున్నారు.


వేలంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల అధికారులు శనివారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఓ చింత రాజ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నల్లాగంటి నర్సయ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రేవతి గంగాధర్, తాజా మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, విజేత యువజన సంఘం అధ్యక్షుడు బద్దం రవి, గోపిడి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరవింద్ పేరును ఉచ్చరించే స్థాయి ఏబీ శ్రీనివాస్‌కు లేదు



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
ఎంపీ అరవింద్ పేరును ఉచ్చరించే స్థాయి ఏబీ శ్రీనివాస్ చిన్నకు లేదని, ఇంకోసారి మాట్లాడితే ఆర్మూర్‌లో తిరగనివ్వబోమని బిజెపి నాయకులు అన్నారు. పట్టణ అధ్యక్షులు మందుల బాలు అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పాత్రికేయుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాన్ శీను, పెంటయ్య, విజయ్ ఆనంద్, ఆర్య రాజేశ్వర్, షికారి శీను, గుగులోత్ తిరుపతి నాయక్, ఉదయ్‌గౌడ్, కలిగోటా ప్రశాంత్, సాయినాథ్, ప్రసన్నగౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీని నిర్మూలించే దిశలో పనిచేస్తున్నాం

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు



అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్
టీబీని నిర్మూలించే దిశలో పనిచేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. దేశ వ్యాప్తంగా టిబి ముక్త్ గ్రామ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో 545 గ్రామ పంచాయతీలో 11 గ్రామ పంచాయతీలు క్షయ రహిత గ్రామాలుగా ఎంపిక చేశారు. అందులో భాగంగా సమావేశానికి హాజరైన జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఈ 11 గ్రామ పంచాయతీలే కాకుండా జిల్లాలో అన్ని గ్రామాల్లో టిబిని నిర్మూలించే దిశలో పనిచేస్తున్నామని, త్వరలో జిల్లా క్షయ రహిత జిల్లాగా మారబోతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ కార్యదర్శులకు టిబి లక్షణాలు, జాగ్రత్తలు, నివారణ చర్యలు వంటి అంశాలపై టిబి కోఆర్డినేటర్ రవి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తుకారాం రాథోడ్, జిల్లా టిబి కోఆర్డినేటర్ రవిగౌడ్, నవీపేట్ ఎంపీఓ రామకృష్ణ, ధర్పల్లి ఎంపీవో రాజేష్, మోపాల్ ఎంపీవో కిరణ్, ఇందల్వాయి ఎంపీవో రాజఖాన్, సిరికొండ ఎంపీవో తారాచంద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జలమే జీవనాధారం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
జలమే బలం అని.. జలమే మనకు జీవనాధారమని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో తెలంగాణ రచయితల వేదిక కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక జీవికి నీరే జీవనాధారమని అన్నారు. నీటితోనే జనాలకు బలం ఉంటుంది, బలమే మనకు జీవనాధారమని అన్నారు. భూగర్భ జలాలు తగ్గించకుండా చూసుకోవాలని, భూగర్భ జలాలు పెంచుకునేందుకు ప్రతి ఒక్క ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతం

- పది పరీక్షలకు 39 మంది విద్యార్థులు గైర్హాజరు
- పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం
పదో తరగతి పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా అధికారులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిజామాబాద్ సిటీ : రెండవ రోజు నిర్వహించిన 141 పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో 22,724 మంది విద్యార్థులకు గానూ 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏ పరీక్ష కేంద్రంలోనూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. డిఈఓ 7 పరీక్ష కేంద్రాలను, డిస్టిక్ లెవెల్ అబ్జర్వర్ 5 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్కార్డ్ 41 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షణ చేశారని వివరించారు.

10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీపీ..

కంఠేశ్వర్ : పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఐపీఎస్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను శనివారం పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ యాక్ట్-2023 అమలులో ఉంటుందని, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, ఎవ్వరూ అవకతవకలకు పాల్పడవద్దని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి టైమ్ మేనేజ్మెంట్ చేసుకుంటూ పరీక్షలు రాయాలని కోరారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు రావాలని అన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరా లకు అనుమతి లేదని తెలిపారు. అలాగే స్పార్ట్ వాల్యేషన్ జరుగు తున్న నిర్మల హృదయ స్కూ ల్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ పరిశీలనలో సిపి వెంట సంబంధిత పోలీస్ శాఖ అధికారులు, టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, బందోబస్తు సిబ్బంది ఉన్నారు.

బాల్కొండ : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా రెండవ రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. మండలంలో రెండవ రోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు మొత్తం 3 పరీక్ష కేంద్రాల్లో 514 మందికి గాను 514 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండ 216, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాల్కొండలో 202, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిసాన్‌నగర్‌లో 96 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నవీపేట్: మండలంలోని 5 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తుండగా మొత్తం 626 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరూ గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎమ్మార్వో వెంకటరమణ, ఎంఈఓ అశోక్, ఎస్సై వినయ్ కుమార్ పరిశీలించారు.

మాక్లూర్ : మండల పరిధిలోని 4 పరీక్ష కేంద్రాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండవ రోజు మొత్తం 645 మంది విద్యార్థులకు గానూ అందరు విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు మండల విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. సకాలంలో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు క్షుణంగా పరిశీలించి లోపలికి పంపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కంఠేశ్వర్: పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సీపీ


నవీపేట్‌లో..

వామపక్ష పార్టీల నాయకులు అరెస్టు

నవతెలంగాణ-విలేకరుల బృందం
బోధన్ : శాసనసభ సమావేశాల సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులను శనివారం బోధన్ అర్బన్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి, ఐఎఫ్టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్యను, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వరదయ్య హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు శనివారం ఇందిరా పార్క్ వద్ద గత ప్రభుత్వం 2021లో ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలంటూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టగా దానికి వెళుతున్న కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని మల్లేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎడపల్లిలో సిఐటియూ నాయకుల ముందస్తు అరెస్ట్

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి గ్రామానికి చెందిన సిఐటియు జిల్లా నాయకులు జంగం గంగాధర్‌ను ఎడపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం తమను అరెస్టు చేసినా పోరాటం ఆగదని తెలిపారు.

టియుసిఐ, సిఐటియు నాయకుల అరెస్టు..

ఆర్మూర్ : టియుసిఐ జిల్లా అధ్యక్షుడు ముత్తన్నను, సిఐటియు మండల కార్యదర్శి కూతాడి ఎల్లయ్యను, టియుసిఐ మండల నాయకుడు అరవింద్‌ను, నిఖిల్, మునీర్‌ను పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. ఇందిరా పార్కులో అసంఘటితరంగ కార్మికుల మహాధర్నా నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సిఐటియు, టియుసియు నాయకులు, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు.

ముందస్తు అరెస్టుల్ని ఖండించండి..

కమ్మర్‌పల్లి : మండల పరిధిలోని కమ్మర్‌పల్లి, నాగపూర్ గ్రామాలకు చెందిన సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్మిక సంఘాల పిలు పులో భాగం గా చలో హైద రాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు సారా సురేష్ పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ముందస్తుగా అర్ధరాత్రి నుండి అరెస్టు చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్య దేశంలో తగదన్నారు. నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని అనుకుంటే దానికి తగిన సమాధానం ప్రజలే చెప్తారన్నారు. అరెస్ట్ చేసిన సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సారా సురేష్, ఉట్నూరి బాలయ్య, బసిరి అశోక్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


ఆర్మూర్ : నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు


ఎడపల్లి:అరెస్టయిన జంగం గంగాధర్

ఉప్లూర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని ఉప్లూర్‌లో స్థానిక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు శనివారం తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ భవనంలో లేదా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు పేర్కొన్నారు. ఆర్మూర్‌కు చెందిన లైఫ్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు విన్నవించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్, పలువురు

నవతెలంగాణ-వర్ని
మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో రాజయ్య వ్యక్తికి రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,35,000 చెక్కును మాజీ సర్పంచ్ సత్యనారాయణ లబ్ధిదారులకు శనివారం అందజేశారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతం సంజీవ్, సాయిలు, యూసుఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఈనెల 24వ తేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలియజేశారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు తెలియజేశారు. వెంటనే తమ అపాయింట్మెంట్ ఆర్డర్లను డౌన్‌లోడ్ చేసుకుని 24వ తేదీన ఉదయం పదిన్నర గంటలకు మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఆయా గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంటనే ఫిజిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రిన్సిపాల్‌లు వెంటనే మూల్యాంకనం ఆర్డర్ కాపీలు వచ్చిన అధ్యాపకులను విధుల నుంచి రిలీవ్ చేయనట్లయితే ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు. నాట్ అప్పాయింటెడ్ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి తెలియజేశారు.

విజయవంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

- కలెక్టర్ అభినందన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ఇంటర్ విద్యాధికారితో పాటు పరీక్షల నిర్వహణ కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియోద్దీన్, అస్లాం, హై పవర్ కమిటీ శ్రీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరీక్షల విభాగానికి విద్యుత్ శాఖ, ఆర్టీసీ, ఆరోగ్యశాఖ, పోస్టల్, శాఖ, మున్సిపల్, గ్రామ పంచాయతీ విభాగాలు సహకరించాయని తెలియజేశారు. అలాగే జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఎప్పటికప్పుడు తమకు సహకరిస్తూ అన్ని విభాగాలను సమన్వయం చేసి తమను ఇంటర్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు నడిపించారని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఇంటర్ విద్యాధికారి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
వేల్పూర్ మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ శనివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఏలేటి బల్క చిన్నారెడ్డి వాళ్ళ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. గ్రామానికి చెందిన ప్రమోద్ వల్ల నాన్న ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల అనారోగ్యాలకు గల కారణాలను వారి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

- ఏఐయుకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్


వరిని పరిశీలిస్తున్న ఏఐయుకేఎస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
వడగండ్ల వానకు నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని, గత నాలుగేండ్ల నుంచి ప్రకృతి విలయ తాండవంతో నిండా మునుగుతున్న రైతాంగాన్ని, మానవతాదృక్పథంతో అలోచించి ఆదుకోవాలని, రైతాంగానికి టోపీ పెట్టిన గంగాకావేరి సిడ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత ఐక్యరైతు సంఘం (ఏఐయుకే.ఎస్.) రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం సిరికొండ మండలంలోని కొండూరు, తదితర గ్రామాల్లో వడగండ్ల వానకు రాలిపోయి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగళ్ల వానతో మండలంలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలన్నారు. నష్ట పరిహారంతో పాటు రుణమాఫీ, రైతు భరోసా అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపికేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐయుకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవారాం, జిల్లా సహాయ కార్యదర్శి బి.బాబాన్న తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి ఊరేగింపు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని తిరుమల క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శ్రీవారిని ఉదయం సూర్య ప్రభ వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై, గజవాహనంపై ఆలయ వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా రామానుజ దాసు స్వామి మాట్లాడారు. కార్యక్రమంలో దేవనాథ జీయరు స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం


మాట్లాడుతున్న వైద్యులు భాను రామగిరి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల లైఫ్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్పులూరు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు వైద్యులు భాను రామగిరి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పలు పరీక్షలు నిర్వహించి మందులు సైతం పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో న్యూరో వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, శ్రీ వైద్య నిపుణురాలు స్రవంతిరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బదిలీ అయిన డీఎస్పీని సన్మానించిన మాజీ జెడ్పిటిసి


డీఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గత మూడు సంవత్సరాలుగా ఎల్లారెడ్డిలో డీఎస్పీగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు బదిలీపై వెళ్లడంతో హైదరాబాద్‌లో స్థానిక మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి డీఎస్పీని శాలువాతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను పరిరక్షించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

- మహిళా సంఘాలకు అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎం

నవతెలంగాణ-రామారెడ్డి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎం ప్రసన్నకుమార్ మహిళా సంఘాల వివోలకు, గ్రామ సంఘ అధ్యక్షులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తూ.... మానవ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆదారిత అక్రమాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అక్రమాలపై చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రతి సభ్యురాలకు అవగాహన కల్పించాలని, సూచించారు. కార్యక్రమంలో సీసీలు భూమా గౌడ్, దుర్గా దాస్, శ్రీనివాస్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పద్మ దినేష్ (52) మండల కేంద్రంలో ఆధార్, మీసేవ కేంద్రాన్ని భార్యాభర్తలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం స్టేషనరీ, నిత్యవసర సరుకులకు కామారెడ్డి వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి గొల్లపల్లి ఎక్స్ రోడ్ సమీపంలో వర్షంలో బైకు అదుపుతప్పి కింద పడటంతో ముఖానికి, శరీర భాగాలకు గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న పెద్ద బోయిన లింబాద్రికి చెందిన ఆటో బైకు తగిలి అదుపుతప్పి రోడ్డు కింద పడటంతో, లింబాద్రి తో పాటు భార్య గాయలవడంతో ముగ్గురిని 108 లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పద్మ దినేష్ మృతి చెందాడని భార్య పద్మ పద్మజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి ఎంఈఓ వార్నింగ్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ తో పాటు విద్యార్థులను తీసుకెళ్లి ఇన్విజిలేటర్లతో మాట్లాడిన విషయం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురించిన విషయం తెలిసిందే. కథనానికి స్పందించిన భిక్కనూర్ ఎంఈఓ రాజా గంగారెడ్డి శనివారం ఆ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని పిలిచి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి సెల్ ఫోన్ లతో వెళ్ళవద్దని, చీఫ్ సూపరింటెండ్‌కు సమాచారం ఇవ్వాలనుకుంటే పరీక్షా కేంద్రం గేటు బయట నుండి మాత్రమే ఇవ్వాలని, విద్యార్థులను తీసుకెళ్లి పరీక్షా కేంద్రంలో యాజమాన్యం కూర్చోబెట్టవద్దని హెచ్చరించినట్లు తెలిపారు.

భగత్ సింగ్, రాజ్‌గుర్, సుఖదేవ్‌ల వర్ధంతి

నవతెలంగాణ-ఆర్మూర్

పివైఎల్-పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యదర్శి బి.కిషన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ మాట్లాడుతూ.. 200 సంవత్సరాలు భారతదేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమంలో కామ్రేడ్ భగత్ సింగ్, సుఖదేవులు పాల్గొని ఉద్యమించిన పోరాటా పటిమ నేటి విద్యార్థి, యువకులకు మార్గదర్శకం కావాలని తెలిపారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా కార్యదర్శి రవి, పిడిఎస్‌యు ఏరియా ఉపాధ్యక్షుడు జి.వినోద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు యువత ముందుకు రావాలి

- న్యాయవాది నవీన్ రాజ్

నవతెలంగాణ-నవీపేట్

సమ సమాజ స్థాపనకు యువత ముందుకు రావాలని న్యాయవాది నవీన్ రాజ్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలో కామ్రేడ్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా శనివారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, న్యాయవాది నవీన్ రాజ్ మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దోపిడీ, సమ సమాజానికై పోరాటం చేసి బ్రిటిష్ వారి నుంచి దేశ విముక్తికై పోరాడిన భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, నవీన్, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు కటారి రాములు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పరిధిలోని నిజామాబాద్ కాకతీయ అడ్డా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం (ఏఐఆర్టిడబ్ల్యూఎఫ్) సిఐటియు ఎల్లప్పుడూ అండగా నిలబడుతూ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అదేవిధంగా అర్హులైన వాళ్లందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, ప్రమాదబీమా, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. 2019 మోటార్ వెహికల్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, 29 లేబర్ కోడ్‌లను పునరుద్ధరించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, తెలంగాణ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ రెండు దఫాలుగా ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారని, రవాణా రంగ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వాగ్దానం చేశారని తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు పరచలేదని.. అందుకు నిరసనగా ఈనెల 21న రవాణా రంగం కార్మికులతో ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పండరి విట్టల్, అబ్దుల్ అమిత్, ఇమ్రాన్, ఎండి అస్లాం, ఎండి అశ్వక్, తదితరులు పాల్గొన్నారు.

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా..
హసాకొత్తూరు వాసి ఉట్నూర్ నరేష్ ఎంపిక


నియామకపత్రాన్ని అందుకుంటున్న ఉట్నూర్ నరేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన ఉట్నూర్ నరేష్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీసు కమిషనర్ రేటు తెలంగాణ యాంటీ నార్కో టిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శండిల్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ శిక్షకుడు, ఆర్మూర్ ఐసీఐ ఫౌండర్ ప్రెసిడెంట్ ఉట్నూర్ నరేష్‌ను యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా ఎంపిక చేసి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శండిల్య మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, ఇది తీవ్రవాద సమస్య కంటే ఎక్కువ ప్రమాదంగా మారిందన్నారు. దీనిని అరికట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ సీత రమేష్ మాట్లాడుతూ ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న పిల్లలు బానిసలుగా మారడం తనను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ బాధితులు, డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నట్లు అనుమానం ఉంటే టోల్ ఫ్రీ 1908 ఫోన్ చేసి వివరాలు తెలుపవచ్చున్నారు. వివరాలు గోప్యంగా ఉంటూనే మీరు ఫోన్ చేసినప్పుడు మాకు ఫోన్ నెంబర్ కానపడదని ఎవరు దీని విషయంలో అనవసరంగా బయపడవద్దని సూచించారు.

చాలా సంతోషంగా ఉంది : నరేష్

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రాష్ట్ర స్థాయి శిక్షకుడిగా ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని ఉట్నూర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో శిక్షకుడిగా ఎంపికవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా మార్చడంలో యాంటీ సోల్జర్‌గా పని చేస్తానని చెప్పారు. తన అవసరం ఎక్కడున్నా 9440007609 ఫోన్‌చేస్తే వస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ గంప నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీయొచ్చు

- డిఈఓ అశోక్
- విశ్వవికాస్ పాఠశాలలో వి ఇగ్నైట్ ఎక్స్‌పో


ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో


డీఈవోను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలికితీసే అవకాశముంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని విశ్వ వికాస్ పాఠశాలలో శనివారం వి-ఇగ్నైట్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని డీఈఓ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో రానున్న రోజులలో రోబోటిక్, కోడింగ్ వాటికి మరింత ప్రాముఖ్యత పెరగనుందని అన్నారు. వి-ఇగ్నైట్ ఎక్స్‌పో 2025 కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యత మరింతగా ముందుకు తీసుకువెళ్లే దిశగా ఉందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ ప్రదర్శన ఎంతో ఆలోచింపజేసేవిధంగా ఉందని వివరించారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత మరింత బయటకు వస్తుందని విద్యార్థులను ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు స్కూళ్లలో నిర్వహించడంతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యత, ఆలోచన పరిజ్ఞానం మరింత ముందుకు తీసుకు వెళుతుందని అన్నారు.

అనంతరం ప్రిన్సిపాల్ సుస్మిత మాట్లాడుతూ.. విద్యార్థులకు భవిష్యత్తులో కోడింగ్, రోబోటిక్స్, టెక్నాలజీ అత్యాధునిక నైపుణ్య ప్రాజెక్టులు, అన్వేషణ చేయడంతో విద్యార్థుల ఆలోచనా పరిణతి చెందుతుందని అన్నారు. ఇటువంటి ప్రయోగాలు చేయడంతో విద్యార్థులు మానసిక దృఢత్వం ఏర్పడుతుందని, దానితో ముందస్తు ఆలోచన చేయడానికి అడుగులు వేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. వి ఇగ్నైట్ ఎక్స్‌పో కార్యక్రమం ఆదివారం సైతం ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవికాస్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

26న తైబజార్, మేకల సంత బహిరంగ వేలం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి తై బజార్, మేకల సంత బహిరంగ వేలం.. ఈ నెల 26న బుధవారము ఉదయము 11.00 గం.లకు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ కామారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహంచనున్నారు. వేలంలో పాల్గొనదలు చుకునే ఔత్సాహికులు నిబంధనలు తెలుసుకొని, ధరావత్తు సొమ్మును డీడీ రూపంలో చెల్లించి పాల్గొవాలని అధికారులు సూచించారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం

- ఘనంగా సన్మానం


క్రీడాకారిణికి ఆర్థికసాయం చేసి సన్మానిస్తున్న గోర్త రాజేందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన గన్న లక్ష్మణ్ కూతురు గన్న వర్షిని భారత జట్టు సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా వర్షినిని జిల్లా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు గోర్త రాజేందర్ శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఖర్చుల నిమిత్తం ఆమెకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 25 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. జక్రాన్‌పల్లి మండలం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికవడం గర్వకారణమన్నారు. ఇలాగే మరెన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరీ వినోద్, బ్రాహ్మణపల్లి సొసైటీ చైర్మన్ తొర్రికొండ నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఉత్కం శ్రీనివాస్ గౌడ్, అర్గుల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు సందీప్, నందు, ప్రదీప్, రాజేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణం పనులను పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-దోమకొండ

బిబిపేట్ మండల కేంద్రంలోని, ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం పనులను ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇంటి నిర్మాణం పనులను నాణ్యత చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అబ్బు గౌడ్, అధికారులు సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పైన ఈనెల 26న చలో హైదరాబాద్

నవతెలంగాణ-కామారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అలాగే తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఈనెల 26న హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో ధర్నా నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు అంబావ, సంగీత తదితరులు ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

నవతెలంగాణ-ఆర్మూర్

అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ శనివారం తెలిపారు. లారీ డ్రైవర్ వాగ్మారే చందు, లారీ యజమాని ధ్యారంగుల వీరన్నపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రెండు నియోజకవర్గాల్లో 273 ధాన్యం సెంటర్లు

- ఆర్డీవో రాజా గౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్

బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలలోని మొత్తం 13 మండలాల్లో 273 ధాన్యం సెంటర్లను ప్రారంభించడానికి జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19న ధాన్యం సేకరణ ప్రక్రియ గురించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో "సన్నాహక సమావేశం" జరిగిందన్నారు. సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు.

ఒకరు అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన శంకర్ (30), బాలాజీ అనే ఇద్దరు వ్యక్తులు గత పది నెలల క్రితం గ్రామానికి వలస వచ్చారు. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే వారు ఉంటున్న ఇంటి నుంచి రెండుమూడు రోజులుగా దుర్గంధ వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శంకర్ (30) అనే వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. కాగా బాలాజీ పరార్ అయినట్టు తెలిసింది. ఘటనా స్థలాన్ని రూరల్ సిఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై సంజీవ్ చేరుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.